క్లుప్తంగా

యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా ఫక్రుద్దీన్ అలీ అహ్మద్



యూటీఎఫ్ నల్లజర్ల మండల నూతన కార్యవర్గం

నల్లజర్ల: ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) నల్లజర్ల మండల శాఖ నూతన అధ్యక్షుడిగా షేక్ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ఎంపికయ్యారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో మండల నూతన కమిటీ ఎంపిక జరిగింది. ఆ సంస్థ జిల్లా గౌరవాధ్యక్షుడి వి.శంకరుడు ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా బి.కిశోర్, ఉపాధ్యక్షులుగా జి.చిట్టిబాబు, కె.కృష్ణవేణి, కోశాధికారిగా జి.కృష్ణబాలాజీ, కార్యదర్శులుగా పి.హనుమంతకుమార్, మరియ దాసు, స్వాతి, వీర్రాజు, నాగరాజు, నాగేశ్వరరావు, మోహన్‌రాజు, రాణి, బి.వరలక్ష్మి ఎంపికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా ఎస్ఎఫ్ అలీఅహ్మద్, మనోహరకుమార్, భవానీ, పావనీ, కృష్ణమోహన్, సురేష్‌కుమార్, జయచంద్ర ఎంపికయ్యారు.గౌరవాధ్యక్షులుగా పీవీ అప్పారావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎస్ జిల్లా కన్వీనర్ కె.కమల్‌కుమార్, పి.మురళీధర రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల భాస్కరరావు పదవీకాలం పొడిగింపు

దేవరపల్లి: రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగించింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి జి.జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్ పదవికాలంతో పాటు డైరెక్టర్ల పదవీ కాలాన్ని కూడా పొడిగించారు. ఉత్తర్వులు అందుకున్న ఇళ్ల భాస్కరరావు దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

పొడిగింపుపై హర్షం

చాగల్లు: రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై మండలానికి చెందిన కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నాడ సింహాద్రి, అతిరాస కార్పొరేషన్ డైరెక్టర్ సంసాని రమేష్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నార న్నారు.వైఎస్సార్ సీపీకి బీసీలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని అన్నారు .

కలవచర్లలో బైక్‌ను ఢీకొన్న కారు

తీవ్రగాయాలతో యువకుడు మృతి



పంటపొలాల్లోకి దూసుకెళ్లిన కారు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం కలవచర్ల గ్రామంలో శనివారం రాత్రి బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలతో యువకుడు మృతిచెందగా, అతడి తల్లి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన నార్ని సత్యవతి, ఆమె కుమారుడు నార్ని సూర్యవెంకటేష్ (22) బైక్‌పై డి.ముప్పవరం నుంచి తమ ఇంటికి వెళుతున్నారు. ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన సూర్యవెంకటేష్, సత్యవతిలను స్థానికులు తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటేష్ మృతి చెందగా సత్యవతికి అత్యవసర వైద్యసేవలందిస్తున్నారు. సమిశ్రగూడెం ఎస్ఐ షేక్ సుభానీ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు.

ఘనంగా కోరుపల్లెమ్మ జాతర

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుపల్లి గ్రామదేవతైన కోరుపల్లెమ్మ జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆరేళ్లకు ఒకసారి నిర్వహిస్తున్న ఈ జాతరకు కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. దీంతో గ్రామం బంధుమిత్రులతో కళకళలాడుతోంది. కోరుపల్లెమ్మవారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి సంప్రదాయబద్ధంగా గ్రామోత్సవం, బలిచేట జరిపించారు. గ్రామస్తులు ఆదివారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం శివార్లలో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో గోపవరం గ్రామానికి చెందిన వెలగన సూర్యచంద్రరావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనట్టు సమిశ్రగూడెం ఏఎస్సై గంగాధర్ శనివారం తెలిపారు. సూర్యచంద్రరావు శుక్రవారం రాత్రి నిడదవోలు నుంచి గోపవరం బైక్‌పై వెళుతున్నాడు. సమిశ్రగూడెం శ్రీదేవి బాణసంచా దుకాణం సమీపంలో పల్సర్ బైక్‌పై వెనుక నుంచి వస్తున్న మరో వ్యక్తి అతడిని ఢీ కొట్టాడు. దీంతో సూర్యచంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

పొగాకు క్యూరింగ్ ప్రారంభం

- రంగు ఆశాజనకం
- ఎన్ఎల్ఎస్‌లో 50 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా
- 23 వేల హెక్టార్లలో పంట సాగు
- నమూనాలు సేకరిస్తున్న వ్యాపారులు



దేవరపల్లి మండలం సంగాయగూడెంలో క్యూరింగ్ చేసిన పొగాకు

దేవరపల్లి: పొగాకు క్యూరింగులు ప్రారంభమయ్యాయి. రెండు వారాలుగా పొగాకు రెలుపులు జరుగుతున్నాయి. పక్వానికి వచ్చిన ఆకులను రెలిసి బ్యారన్‌లో క్యూరింగ్ చేస్తున్నారు. ఇప్పటికే రెండు, మూడు రెలుపులు జరిపామని, మొదటి ఆకుల రంగులు బాగున్నాయని రైతులు తెలిపారు. ఈ నెలాఖరుకు ముమ్మరంగా క్యూరింగ్‌లు జరుగుతాయన్నారు. గతేడాది పొగాకు రైతులకు లాభాలు రావడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. గతేడాది 45 వేల ఎకరాల్లో పంట వేయగా, ఈ ఏడాది మరో ఐదు వేల ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగినట్టు అధికారులు తెలిపారు. అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను రైతులు సాగు చేశారు. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల పొగాకు దిగుబడి వస్తుందని అధికారులు అంటున్నారు. గత నెలలో తోటలు తెగుళ్ల బారిన పడినప్పటికీ వాతావరణం అనుకూలించడంతో కోలుకున్నాయని రైతులు తెలిపారు. మార్కెట్ అనుకూలంగా ఉంటుందని అధికారులు, కొనుగోలుదారులు చెప్పడంతో రైతులు ధరపై ఆశలు పెట్టుకున్నారు. గతేడాది రైతుకు కిలో సగటు ధర రూ.191.74 లభించింది.

అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలోని ఉత్తర ప్రాంత తేలిక నేలల్లో (ఎన్ఎల్ఎస్) దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రాల పరిధిలో 15 మండలాల్లో పొగాకును పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో పండించిన ఎన్ఎల్ఎస్ పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఎక్కువ. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన పొగాకును ఇక్కడి రైతులు పండిస్తారు. ఇక్కడి ఎన్ఎల్ఎస్ పొగాకుకు అంతర్జాతీయంగా బ్రాండ్ ఇమేజ్ ఉంది. ఈ కారణంగా మార్కెట్లో తమకు గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు, అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

23 వేల హెక్టార్లలో పొగాకు సాగు

2022–23 పంట కాలానికి 23 వేల హెక్టార్లలో పొగాకు సాగు చేశారు. పొగాకు బోర్డు 48.76 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, 50 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందని అధికారులు, ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. 12,458 మంది రైతులు పొగాకు పండిస్తున్నారు.



పొగాకు ఆకులను కర్రలకు అల్లుతున్న కూలీలు

రంగులు ఆశాజనకంగా ఉన్నాయి



పొగాకు రంగులు ఆశాజనకంగా ఉన్నాయి. రెండు, మూడు క్యూరింగ్‌లు జరుగుతున్నాయి. ఫిబ్రవరి నుంచి క్యూరింగ్‌లు ముమ్మరంగా జరుగుతాయి. కూలీల కొరత ఎక్కువగా ఉంది. అల్లిక యంత్రాలను సరఫరా చేయడానికి బోర్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎరువుల ధరలు, భూముల కౌలు, ఆకురెలుపు బంటాల రేటు పెరగడంతో ఎకరాకు 20 శాతం ఉత్పత్తి ఖర్చు పెరిగింది. దీనిని దృష్టిలో పెట్టుకుని మార్కెట్లో గిట్టుబాటు ధర ఇవ్వాలి.

– కరుటూరి శ్రీనివాస్, అధ్యక్షుడు, పొగాకు రైతు సంఘం, దేవరపల్లి

అవశేషాలు లేని పొగాకుకు డిమాండ్

పురుగు మందుల అవశేషాలు లేని పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఉంది. వాటి అవశేషాలుంటే కొనుగోలుదారులు నిరాకరిస్తున్నారు. దీని ప్రభావం ఎగుమతులపై పడుతుంది. పొగాకు క్యూరింగ్‌లు జరుగుతున్నాయి. పొగాకు రంగులు, నాణ్యత బాగుంది. రైతులకు గిట్టుబాటు మార్కెట్ ఉంటుందని ఆశిస్తున్నాం. ఈ ఏడాది ఎన్ఎల్ఎస్‌లో రెండు వేల హెక్టార్ల సాగు విస్తీర్ణం పెరిగింది. 48 నుంచి 80 మిలియన్ల కిలోల ఉత్పత్తి అవుతుందని అంచనా.

– జీఎల్‌కే ప్రసాద్, ఆర్ఎం, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఉండ్రాజవరం: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం మండలంలోని వెలగదుర్రు జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ లబ్ధిదారులకు గృహ నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉందన్నారు. హౌసింగ్ ఏఈ ఎం.విక్టర్‌బాబు మాట్లాడుతు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలంలో ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో ఇళ్లు నిర్మించుకుని లబ్ధిదారులు తమ సొంతింటి కలను నిజం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షాన్ బీబీ షేక్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చాగల్లు: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో బి.రాంప్రసాద్ సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో మండలంలోని చిక్కాల జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఎంపీడీవో రాంప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికీ గృహ నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే మొదలు పెట్టాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై గృహ నిర్మాణ సామాగ్రిని అందజేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బి.ఏడుకొండలు, సర్పంచ్ కొయ్యే మణి మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అండగా ఉంటున్నాం.. మరో అవకాశం ఇవ్వండి

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- దారవరంలో గడప గడపకూ..



దారవరంలో మాట్లాడుతున్న మంత్రి తానేటి వనిత

చాగల్లు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మంత్రి శనివారం దారవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ ఆమె వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే మండల కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, అయితే ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నకు ప్రజలందరూ అండగా ఉండి మరోసారి ఆయనను సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా దారవరం వాసుల సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. తొలుత డ్వాక్రా మహిళలతో జరిగిన సభలో మంత్రి వనిత పాల్గొన్నారు.

రహదారికి ప్రారంభోత్సవం

దారవరం నుంచి పశివేదల వరకూ రూ.2.82 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన రహదారిని మంత్రి తానేటి వనిత ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఆత్మ చైర్మన్ గంద్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, దారవరం సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ పనులు త్వరగా పూర్తిచేయాలి

- కార్యదర్శులు, వీఆర్వోలతో ఎంపీడీఓ సమీక్ష

నల్లజర్ల: గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రతిపాదించిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ కె.జోగేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. మండలంలో గడపగడపకూ కార్యక్రమం పూర్తయిన 23 సచివాలయాల్లో గుర్తించిన 112 పనుల కోసం రూ.3.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. వాటిలో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఉన్నాయన్నారు. కొన్ని గ్రామాల్లో ఈ పనులు ఇప్పటికే పూర్తవగా, మరికొన్ని గ్రామాల్లో ప్రారంభించలేదన్నారు. వెంటనే ఆ పనులు మొదలుపెట్టి, సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయా గ్రామాల ప్రజల నుంచి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలన్నారు. పక్కాగృహాలు, ఇళ్ల స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలించి వారికి ఇంతవరకూ ఎందుకు స్థలాలు, ఇళ్లు మంజూరు చేయలేదో క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. అర్హులైతే వెంటనే వారిపేరు నమోదు చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీరాజ్ డైరీలను ఎంపీడీవో అందజేశారు.కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ విజయకుమార్, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పసుపు రేల్పులు

- ఆశాజనకంగా ధర
- మార్కెట్‌లో పుట్టు ధర రూ.21 వేలు



అన్నవరప్పాడులో పసుపు రెలుస్తున్న కూలీలు

పెరవలి: మండలంలో పసుపు రేల్పులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఏటా సంక్రాంతి నాటికే ఈ పనులు పూర్తయ్యేవి. మంచి ఆదాయం వచ్చే పని కావడంతో ఈ పనులకు వెళ్లటానికి కూలీలు ఆసక్తి చూపేవారు. అయితే ఈ ఏడాది రేల్పులు ఆలస్యంగా సంక్రాంతి తర్వాత మొదలయ్యాయి. పెరవలి మండలంలో 120 ఎకరాల్లో పసుపు సాగు జరుగుతోంది. అన్నవరప్పాడు, కండింపాడు, మల్లేశ్వరం, ఖండవల్లి, ముక్కామల, తీపర్రు గ్రామాల్లో పసుపు సాగు చేశారు. ఈ ఏడాది దిగుబడులు బాగానే ఉన్నాయని మార్కెట్‌లో లభించే ధరను బట్టి గిట్టుబాటవుతుందా? లేక నష్టాలు వస్తాయా అనేది వేచి చూడాలి. ప్రస్తుతం మార్కెట్‌లో పుట్టు పసుపు ధర (పుట్టు అనగా 236 కిలోలు) రూ.21,000 ఉంది. గతేడాది ఇదే సమయంలో పుట్టు పసుపు రేటు రూ.17 వేలు పలికింది. ఈ ధర నిలకడగా ఉన్నా, లేక పెరిగినా రైతులకు సంతోషమే. తగ్గితే మాత్ర గిట్టుబాటు కాదని చెబుతున్నారు. పసుపు ధరలో హెచ్చుతగ్గుల విషయం నెల తరువాత తెలుస్తుందని అన్నవరప్పాడుకు చెందిన పసుపు రైతు పి.సత్యనారాయణ తెలిపారు. దీనిని బట్టి పసుపు రేల్పులు పూర్తయి, పసుపును ఉడకవేసి, తయారయ్యేటప్పటికి ధర ఎలా ఉంటుందో తెలియదని ఆయనన్నారు. ధర బాగుంటే మిగులుతుంది, లేకపోతే నష్టపోవలసి వస్తుందన్నారు.

ముగిసిన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల శిక్షణ



ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమంలో నిరుద్యోగులు, మానవత సంస్థ సభ్యులు

తాళ్లపూడి: పోటీ పరీక్షల్లో మంచి మార్కులు పొంది ఉద్యోగం సాధించాలని మండల మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె.వెంకటేశ్వర రావు ఆకాంక్షించారు. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న 35 మంది నిరుద్యోగులకు మానవత సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో తాళ్లపూడిలోని కరిబండి విద్యాసంస్థలో 40 రోజుల పాటు నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ శనివారంతో ముగిసింది. నిరుద్యోగ అభ్యర్థులకుఉచితంగా స్టడీ మెటీరియల్ కూడా అందజేశారు. ముగింపు కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అభ్యర్థులందరూ ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ రీజినల్ చైర్మన్ వి.చంద్రయ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మురళి, ఆ సంస్థ సభ్యులు అప్పన గుప్త, సీహెచ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోగులు, వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ

- ఘనంగా రాజీవ్ కృష్ణ జన్మదిన వేడుకలు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

కొవ్వూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు (పరిశ్రమలు,పెట్టుబడులు,మౌలిక సదుపాయాల కల్పన) ఎస్.రాజీవ్‌కృష్ణ పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఆ పార్టీ నాయకులు కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం వాత్సల్య వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. భోజన వసతి కూడా ఏర్పాటు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి రాజీవ్‌కృష్ణకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్ గంద్రోతు అంజనీదేవి, చాగల్లు ఎంపీపీ మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, మలకపల్లి, కాపవరం, పశివేదల, కొవ్వూరు సొసైటీల మాజీ అధ్యక్షులు ఇమ్మణ్ని వీరశంకరం, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, పరిమి సోమరాజు, కంఠమణి రమేష్, టౌన్ యూత్ ప్రెసిడెంట్ సలాది వాసు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



తెలికిచర్లలో అంతర్ జిల్లాల అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

నల్లజర్ల: స్కూల్‌గేమ్స్ అంతర్ జిల్లాల అండర్-14 ఫుట్‌బాల్ పోటీలు రెండో రోజు శనివారం తెలికిచెర్ల ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో హోరాహోరీగా జరిగాయి. బాలుర విభాగం క్వార్టర్స్ ఫైనల్స్‌లో నెల్లూరు జట్టు కర్నూల్ జిల్లా జట్టుపై విజయం సాధించింది. అలాగే అనంతపురం జట్టు విజయనగరం జిల్లా జట్టుపై గెలిచింది. కడప జిల్లా జట్టు చిత్తూరు జిల్లా జట్టుపై నెగ్గింది. విశాఖ జిల్లా జట్టు శ్రీకాకుళం జిల్లా జట్టుపై నెగ్గింది. సెమీ ఫైనల్స్‌లో కడప జట్టు శ్రీకాకుళంపై గెలిచింది.

బాలికల విభాగంలో..

వైఎస్సార్ కడప జిల్లా జట్టు పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై విజయం సాధించింది.అనంతపురం జట్టు కృష్ణా జిల్లా జట్టుపై నెగ్గింది. నెల్లూరు జిల్లా జట్టు గుంటూరు జట్టుపై విజయం సాధించింది. ప్రకాశం జిల్లా జట్టు కర్నూల్ జిల్లా జట్టుపె విజయం సాధించింది. సెమీ ఫైనల్‌కు వైఎస్సార్ కడప, గుంటూరు, నెల్లూరు, అనంతపురం జిల్లాల జట్లు చేరుకున్నాయి. ఆదివారం భారతీయ విద్యాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విజేతలకు బహుమతులు అందిస్తారని ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్‌ఐపీ ఎం.మనోహర్ ,జిల్లా కార్యదర్శి బి.జాన్సన్ తెలిపారు.

షామియానా, లైటింగ్ నిర్వాహకుల సమస్యలపై చర్చ

ఉండ్రాజవరం: నిడదవోలు–తణుకు నియోజకవర్గాల షామియానా, లైటింగ్, డీజే ఓనర్స్, వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని శనివారం మండలంలోని తాడిపర్రు గ్రామంలో నిర్వహించారు.సభ్యులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని యూనియన్ అధ్యక్షుడు అల్లవరపు నారాయణరావు కోరారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై సప్లయ్ కంపెనీ యజమానులు, వర్కర్లు సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో కార్యదర్శి బస్వా ఏసుబాబు, కోశాధికారి దొమ్మేటి వెంకటేశ్వరరావు, సభ్యులు నంద్యాల రమేష్, పెయ్యాల గంగా బాలుడు, కానూరు నారాయడు, వేము కృపావరం, వెలిగట్ల రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ



హెల్మెట్ లేని ప్రయాణికులకు గులాబీ పువ్వులు ఇస్తున్న ఎంవీఐ భీమారావు

కొవ్వూరు: ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపేటపుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే ప్రాణాలకే ముప్పని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) బి.భీమారావు హెచ్చరించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని మినీ బైపాస్ రోడ్డులో ఆర్టీసీ డ్రైవర్లకు, ఇతర వాహనాల డ్రైవర్లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవింగ్ చేసేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనల గురించి భీమారావు వారికి వివరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం మానుకోవాలన్నారు. అనంతరం మినీ బైపాస్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు, ఆర్డీవో కార్యాలయం మీదుగా టోల్‌గేట్ జంక్షన్ వరకు హెల్మెట్‌లు ధరించి మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. టోల్ గేట్ జంక్షన్ వద్ద హెల్మెట్ ధరించి వెళ్లే ద్విచక్ర వాహనదారులకు గులాబీ పువ్వులు, చాక్లెట్స్ ఇచ్చి హెల్మెట్ ప్రాముఖ్యత గురించి వివరించారు.ఆర్టీసీ కొవ్వూరు డిపో మేనేజర్ వైవీఎస్ కుమార్, అసిస్టెంట్ ఎంవీఐ ఎండీ జమీర్, తాళ్లపూడి ఎస్సై వైవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



తాడిమళ్లలో డ్వాక్రా మహిళలకు రుణాల నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీపీ, స్థానిక నాయకులు, ఎస్‌బీఐ సిబ్బంది

నిడదవోలు రూరల్: బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఖాతాదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తాడిమళ్లలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ తాడేపల్లిగూడెం రీజినల్ మేనేజర్ బి.రాజశేఖరం మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు అండగా ఉండేందుకు రూ.కోటి రుణాలను మంజూరు చేశామని చెప్పారు. అనంతరం డ్వాక్రా సంఘాల సభ్యులకు నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె.ప్రేమానంద్, సర్పంచ్ బయ్యే రాధారాణి, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెనుగొండ కృష్ణమోహన్, కాపకాయల సూర్యనారాయణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వాసవీమాతకు గోదావరి జలాలతో అభిషేకం

కొవ్వూరు: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 108 కలశాల గోదావరి జలాలతో వాసవీమాతకు అభిషేకం చేస్తామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు శనివారం తెలిపారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం అక్కడే పది జంటలతో అమ్మవారి ఆత్మార్పణ హోమాలు నిర్వహిస్తామన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

నిడదవోలు: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు అన్నారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన బీజేపీ పట్టణ శాఖ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలపై పోరాడాలంటూ దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ నాయకులు బండి సత్యనారాయణ, బండారు రాంబాబు, సింహాద్రి సత్యనారాయణ, మోర్తా బాల వినోద్, సాయికుమార్, కందుకేరి మనోజ్‌బాబు, ప్రమోద్ కుమార్, సుంకర నరసింహం, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని పందలపర్రు గ్రామానికి చెందిన తోరం కావ్య అనే యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ రామారావు శనివారం తెలిపారు. ఈనెల 17న కావ్య ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఆమె తల్లి రామ తులసి ఇచ్చిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.